క్లుప్తంగా

ప్రశాంతంగా ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష



టెక్కలి ఎంజేపీ ఏపీ పాఠశాలలో పరీక్ష అనంతరం బయటకు వస్తున్న విద్యార్థులు

టెక్కలి: డివిజన్ కేంద్రమైన టెక్కలిలో ఆదివారం నిర్వహించిన ఎన్‌ఎంఎంఎస్ జాతీయ స్కాలర్‌షిప్ అర్హత పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఏడు కేంద్రాల్లో 1642 మంది విద్యార్థులు హాజరై పరీక్ష రాయగా.. 36 మంది గైర్హాజరయ్యారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా విద్యా శాఖాధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

తిలక్ పరామర్శ



సిమ్మన్న మాస్టార్‌ను పరామర్శిస్తున్న తిలక్, నాయకులు

టెక్కలి: కోటబొమ్మాళి మండలం రేగులపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ కార్యకర్త, వెలమ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ దుంగ సిమ్మన్న మాస్టార్ అనారోగ్యానికి గురయ్యారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ రేగులపాడు గ్రామానికి ఆదివారం వెళ్లి సిమ్మన్న మాస్టార్‌ను పరామర్శించి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు. నాయకులు సంపతిరావు హేమసుందర్‌రాజు, నూక సత్యరాజు, గోవిందరావు, చంద్రరావు, పొన్నాన మోహన్‌రావు, రమణమూర్తి ఉన్నారు.

చెస్ శిక్షణ కేంద్రం ప్రారంభం



చెస్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

టెక్కలి: టెక్కలిలో ఏర్పాటు చేసిన చెస్ ఉచిత శిక్షణ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని జాతీయ చెస్ ఇన్ స్కూల్స్ కమిటీ సభ్యుడు ఎస్.భీమారావు కోరారు. స్థానిక లక్ష్మీ నృసింహస్వామి ఆలయానికి ఎదురుగా శిక్షణ కేంద్రాన్ని ఆదివారం ప్రారంభించారు. వారానికి మూడు రోజులు కేంద్రాన్ని నిర్వహిస్తామన్నారు. వివరాలకు 99125 59735 నంబర్‌ను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎ.గౌరీ, శ్రీను, అరుణకుమారి పాల్గొన్నారు.

ప్రతిభా విద్యార్థులకు ప్రోత్సాహకం



విద్యార్థులను సత్కరిస్తున్న ఒడియా మైనార్టీ నాయకులు

ఇచ్ఛాపురం రూరల్: పదో తరగతిలో 2023–24 విద్యా సంవత్సరంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులు పురస్కారాలు అందుకున్నారు. ఆదివారం కంచిలి మండల కేంద్రంలో జరిగిన 'మేథా సమ్మాన్' కార్యక్రమంలో ఈదుపురం ఒడియా ఉన్నత పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులు రేష్మా బెహరా, సుభద్ర బెహరాలను ఒరియా మైనార్టీ అధ్యక్షుడు సత్యన్నారాయణ పాడీ, కంద్రకుల స్తుల నాయకుడు రామచంద్ర బెహరా, హంగీర్ బెహరాలు ఘనంగా సత్కరించారు.

మంత్రి ప్రకటించిన మరుక్షణమే.. నీటి సరఫరా నిలిపివేత!



టెక్కలి సమీపంలోని వంశధార కాలువలో తగ్గుముఖం పట్టిన నీటి ప్రవాహం

టెక్కలి: ఈ ఏడాది రబీ సీజన్‌కు సాగునీరు అందివ్వలేమని వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఇటీవల ప్రకటన చేశారు. అంతే.. మంత్రి ఇలా ప్రకటించారో లేదో వంశధార అధికారులు సాగునీటి ప్రవాహాన్ని నిలిపేశారు. టెక్కలి మండలంలో ఈ రబీ సీజన్‌లో సుమారు 8,500 ఎకరాల్లో పంటలు సాగు చేసేందుకు రైతులు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో రబీకి సాగు నీరు ఇవ్వలేమని మంత్రి చేసిన ప్రకటనతో రైతులు డీలా పడ్డారు. ఇదిలా ఉండగా రబీ సీజన్‌లో రైతులంతా ఆరుతడి పంటలైన నువ్వులు, చోడీ సాగు చేయాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. వాస్తవంగా ఏటా సంక్రాంతి వరకు సాగు నీరు అందేది. ఇప్పుడు ముందస్తుగానే నీటిని సరఫరాను నిలిపి వేయడంతో రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

డైలీ మార్కెట్‌కు దిక్కేలేదు!

- అభివృద్ధికి నోచుకొని ఇచ్ఛాపురం దినసరి మార్కెట్
- శిథిలావస్థకు చేరిన దుకాణాలు
- మరుగుదొడ్లు లేక ఇబ్బందులు



అభివృద్ధికి నోచుకోని డైలీ మార్కెట్



అధ్వానంగా ఉన్న చేపల విక్రయం స్థలం

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం పురపాలకసంఘం పరిధిలోని తొమ్మిదో వార్డులో గల డైలీ మార్కెట్‌లో సమస్యలు తిష్ట వేశాయి. ఇక్కడ సరైన మౌలిక సదుపాయాల్లేక మార్కెట్‌కి వస్తున్న కొనుగోలుదారులు, వ్యాపారస్తులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కనీస వసతులను అధికారులు ఏర్పాటు చేయలేదు. ఇచ్ఛాపురం ఎమ్మెల్యేగా బెందాళం అశోక్ వరుసగా మూడుసార్లు ఎన్నికై నప్పటికీ నియోజకవర్గం కేంద్రంలోలని ముఖ్యమైన దినవారి మార్కెట్ అభివృద్ధిపై కనీసం దృష్టిసారించలేదు. ఇచ్ఛాపురం మున్సిపాలిటీగా రూపాంతరం చెందకముందు పంచాయితీగా ఉన్నప్పుడు నిర్మించిన షాపుల్లోనే వ్యాపార కార్యకలాపాలు ఇప్పటికీ జరుగుతున్నాయి. సుమారు నాలుగు దశాబ్దాలు దాటిపోవడంతో ఈ షాపులన్నీ శిథిలావస్థకు చేరుకున్నాయి. ఈ మార్కెట్‌లో కూరగాయలు, కిరాణా దుకాణాలతో పాటు చేపల విక్రయాలు కూడా జరుగుతాయి. ప్రస్తుతం ఇక్కడ 46 షాపులు ఉన్నాయి. ఇవి కాక మార్కెట్‌లో పుట్‌పాత్‌పైన చిన్న షెడ్, పాకలు ఏర్పాటు చేసుకొని రెండు వందల మందికి పైగా వ్యాపారాలు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. మార్కెట్‌కి ఇరువైలా ఉండే గేట్లు శిథిలావస్థకు చేరుకోవడంతో వాటిని మున్సిపాలిటీ అధికారులు పూర్తిగా తొలగించేశారు. వాటి స్థానంలో కొత్తగా ఎటువంటి గేట్లను ఏర్పాటు చేయలేదు. దీంతో పశువులు మార్కెట్‌లోనికి ప్రవేశిస్తుండడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఒక్కోసారి కొనుగోలుదారులు, వ్యాపారులపై దాడికి పాల్పడుతుండడంతో పలువురు గాయపడిన సందర్భాలు ఉన్నాయి. ఇచ్ఛాపురం పట్టణం, గ్రామీణ ప్రాంతాలవారితోపాటు సమీప ఒడిశా రాష్ట్రానికి చెందిన గ్రామాలకు అందుబాటులో ఉండే ఈ మార్కెట్‌పై మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ కొరవడింది. దీంతో చిన్నపాటి వర్షం కురిసినా మార్కెట్ మొత్తం చిత్తడిగా తయారవుతుంది. పండుగ రోజుల్లో మార్కెట్‌కి వచ్చేవారు చాలా ఎక్కువమంది ఉంటారు. మార్కెట్‌లో మరుగుదొడ్లు లేకపోవడంతో అత్యవసర సమయంలో ఇక్కడకు వచ్చేవారు పడరాని పాట్లుపడుతున్నారు. సుమారు మూడు ఎకరాల విస్తీర్ణం గల దినవారి బజాన్‌ను మోడల్ మార్కెట్‌గా అభివృద్ధి చేస్తే ఉపయోగకరంగా ఉంటుందని స్థానికులు కోరుతున్నారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా ఇక్కడ నుంచి ఎన్నికై..ప్రస్తుతం విప్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న బెందాళం అశోక్ డైలీ మార్కెట్ అభివృద్ధిపై దృష్టిసారించాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్యను పట్టించుకునే వారెవరు..



డైలీ మార్కెట్‌లో నెలకున్న సమస్యలతో చాలా రోజులుగా ఇబ్బందులకు గురవుతున్నాము. ఉండడానికి నీడ లేని పరిస్థితుల్లో ఉన్నాం. మార్కెట్ లో వ్యాపారుల నుంచి పన్నులు వసూలు చేస్తున్నారు గాని అభివృద్ధిని పట్టించుకునే వారు కరువయ్యారు. వర్షం పడితే మార్కెట్ బురదగా మారుతుండడంతో కొనుగోలుదారులు రావడంలేదు. మార్కెట్ గురించి పట్టించుకనేది ఎవరో అర్థం కావడం లేదు.

–పటాన కృష్ణ, కూరగాయల వ్యాపారి

మార్కెట్ అభివృద్ధి చేయాలి



మున్సిపాలిటి పరిధిలోని డైలీ మార్కెట్‌ని అభివృద్ధి చేస్తే వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి. ఇందులో ఉన్న షాపులన్నీ చాలా కాలంనాటివి. దీంతో శిథిలావస్థకు చేరాయి. మరుగుదొడ్లు, మంచినీటి సదుపాయం లేదు. అధికారులు, పాలకులు దృష్టిసారించి డైలీమార్కెట్‌ని అభివృద్ధి చేసి వ్యాపారాలు చేసేవారికే కేటాయించాలి.

–రమేష్‌సాహు, వ్యాపారి

కోనేరు గట్టుపై మళ్లీ ఆక్రమణలు!



కోనేరు గట్టుపై వెలసిన బడ్డీలు

టెక్కలి: టెక్కలి మేజర్ పంచాయతీలో పాత జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న పట్టుమహాదేవి కోనేరు గట్టుపై మళ్లీ ఆక్రమణలు మొదలయ్యాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కోనేరు అభివృద్ధిలో భాగంగా రెవెన్యూ, పంచాయతీ యంత్రాంగం ఎన్నో ప్రయాసలతో ఇదే గట్టుపై ఉన్నటువంటి ఆక్రమణలు తొలగించారు. తాజాగా ప్రభుత్వం మారడంతో గట్టుపై ఆక్రమణలు మొదలవుతున్నాయి. ఇటీవల టెక్కలి ఆర్టీసీ డిపో సమీపంలో లక్ష్మీనృసింహాస్వామి దేవస్థానానికి చెందిన స్థలంలో ఆక్రమణలు చోటు చేసుకోవడం మళ్లీ ఇప్పుడు పట్టుమహాదేవి కోనేరు గట్టుపై బడ్డీలు ఏర్పాటు చేసి ఆక్రమణలు జరుగుతుండడం సర్వత్రా విమర్శలు చోటు చేసుకుంటున్నాయి. టెక్కలిలో ప్రభుత్వ స్థలాలు ఎక్కడా ఆక్రమణలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఒక వైపు మంత్రి అచ్చెన్నాయుడు అధికారులకు గట్టి ఆదేశాలు ఇస్తున్నప్పటికీ క్షేత్ర స్థాయిలో మాత్రం అధికార పార్టీకి చెందిన కొంతమంది కార్యకర్తల అండదండలతో ఇటువంటి ఆక్రమణలు జరుగుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



ఘటన స్థలంలో పడి ఉన్న యువకుడి మృతదేహం

టెక్కలి రూరల్: మండలంలోని లచ్చన్నపేట గ్రామ జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పలాసకి చెందిన వ్యక్తి మృతి చెందాడు. ఈ మేరకు స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. పలాస కోవెలవీధికి చెందిన పిట్ట రవి(34) అనే యువకుడు తన ద్విచక్ర వాహనంపై టెక్కలి వచ్చి, తిరిగి వెళ్తుండగా లచ్చన్నపేట గ్రామ సమీపంలోని రోడ్డు మలుపు వద్ద శ్రీకాకుళం నుంచి పలాస వైపు వెళ్తున్న కారు బలంగా ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. అయితే ద్విచక్ర వాహదారుడు రాంగ్ రూట్‌లో వచ్చినట్లు కారు డ్రైవర్ తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. అనంతరం మృతదేహాన్ని శవపంచనామ నిమిత్తం టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

హిందువులను రక్షించాలి



బస్టాండ్ కూడలిలో నినాదాలు చేస్తున్న వీహెచ్‌పీ ప్రతినిధులు

ఇచ్ఛాపురం: బంగ్లాదేశ్‌లోని మైనారిటీ వర్గానికి చెందిన హిందువులపై జరుగుతున్న దాడులను అరికట్టి వారిని రక్షించాలని విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు బంగ్లాదేశ్‌లో హిందువులకు రక్షణ కల్పించాలని కోరుతూ పట్టణంలోని గ్రామదేవత స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయం నుంచి ర్యాలీ నిర్వహించారు. అమ్మవారి ఆలయం వద్ద ప్రారంభమైన ర్యాలీ మెయిన్‌రోడ్, దాసన్నపేట, రథంవీధి, పంజావీధి, ఆస్పత్రి రోడ్డు గుండా బస్టాండ్ కూడలికి చేరింది. బంగ్లాదేశ్‌లోని హిందువులను రక్షించుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ ప్రతినిధులు రాంప్రసాద్, పాకదాసు, దుర్యోధన, గౌరీ, లోకేష్, శ్రీనివాసరావు, వెంకటరమణ, ప్రేమ్‌కుమార్, ప్రకాశరావు పట్నాయక్, బచ్చు జగన్, లోహిదాస్, ఆశి మోహన్, సత్యం, ఎస్.అప్పారావు, అయ్యప్పస్వాములు, శివస్వాములు, హనుమాన్ స్వాములు పాల్గొన్నారు.

20న 5కే రన్

కాశీబుగ్గ: పలాస మండలం గురుదాసుపురం గ్రామంలో ఈ నెల 20వ తేదీ ఉదయం ఐదు గంటలకు 5కే రన్ నిర్వహిస్తున్నారు. ఈ విషయాన్ని నిర్వాహక కమిటీ సభ్యులు గొరకల లోకేశ్వరరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. బొడ్డపాడు జిల్లా పరిషత్ క్రీడా మైదానంలో ప్రారంభమై గురుదాసుపురం చేరుకుంటుందన్నారు. రన్‌లో గెలిపొందిన వారికి 32 వేల రూపాయలు నగదు, మెమెంటోలు, కన్సోలేషన్ బహుమతులు అందిస్తామన్నారు. ఆసక్తిగల వారు ఈనెల 19వ తేదీ సాయంత్రం లోగా 99637 08029 నంబర్‌కు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

ఉన్న ఒక్క చెట్టునూ పీకేశారు..



చెట్టును తొలగించేందుకు సిద్ధమవుతూ..



తొలగించిన అనంతరం మున్సిపల్ కాంప్లెక్స్ ప్రాంతం

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో జంట పట్టణాలను కలిపే కేటీరోడ్డులో ఉన్న ఒక్కగానొక్క చెట్టును మున్సిపల్ జేసీబీతో ఆదివారం తొలగించారు. పదేళ్ల క్రితం మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ ఎదురుగా నాటిన మొక్క పెద్దదై నీడను ఇస్తుండేది. దీంతో ఎండ సమయంలో చాలామంది ఈ చెట్టు నీడకు చేరేవారు. అయితే ఇటీవల కొద్దిగా చెట్టు పక్కకు వాలడంతో మున్సిపల్ కమిషనర్ రామారావు నేతృత్వంలో జేసీబీతో దాన్ని తొలగించారు. మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని పర్యావరణ ప్రేమికులు కోరుతుంటే.. ఇక్కడ మాత్రం ఉన్న చెట్టును తొలగించడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఒడియా సంఘ ప్రతినిధికి సత్కారం



సుజాత త్యాడీని సత్కరిస్తున్న ప్రతినిధులు

కాశీబుగ్గ: ఏపీ ఒడియా టీచర్స్ అసోసియేషన్ మందస ఆధ్వర్యంలో పదవ మేధా సమ్మాన్ సెర్మనీ–2024లో ఘనంగా ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ కో–ఆప్షన్ సభ్యులు, ఒడియా బ్రాహ్మణ సంఘం కార్యదర్శి గౌరీ సుజాత త్యాడీని ప్రతినిధులు సత్కరించారు. రాష్ట్రంలో ఉన్నటువంటి ఒడియా మైనారిటీల అభివృద్ధికి చేస్తున్న కృషిని అభినందిస్తూ జగన్నాథ చిత్రపటంతో సన్మానించారు.

మత్తుకు చిత్తు కావద్దు



అవగాహన కల్పిస్తున్న ఎస్సై చిన్నంనాయుడు

ఇచ్ఛాపురం: యువత మత్తు పదార్థాలకు అలవాటుపడి జీవితాన్ని చిత్తు చేసుకోవద్దని పట్టణ పోలీసుస్టేషన్ ఎస్సై ఇ.చిన్నంనాయుడు అన్నారు. సంకల్పం కార్యక్రమంలో భాగంగా స్థానిక గొల్లవీధిలో అవగాహన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గంజాయి, మత్తుపదార్థాలకు దూరంగా అందరూ దూరంగా ఉండాలని కోరారు. వాహనాలు నడిపేటప్పుడు రహదారి నిబంధనలు పాటించాలన్నారు. ఎవరైన మత్తపదార్థాలు సేవించిన, విక్రయించిన తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ..



మండుటెండలో అగ్నిమాపక శకటం

కాశీబుగ్గ: మందస మండలంలోని 41 పంచాయతీలకు సేవలందించే అగ్నిమాపక శకటానికి నిలువ నీడలేకుండా పోయింది. కనీసం షెడ్డు కూడా లేకపోవడంతో ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ పాడవుతోంది. ఇప్పటికే రంగువెసిసిపోయింది. వర్షానికి తడిచిపోతుండడంతో వాహనం శిథిలావస్థకు చేరుకుంటుంది. సంబంధిత శాఖ ఉన్నతాధికారులు స్పందించి వాహనాన్ని ఉంచేందుకు కనీసం షెడ్డునైనా ఏర్పాటు చేయాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.

ప్రమాద ప్రయాణం..



విద్యార్థులు ఆటోల్లో ప్రమాదకర ప్రయాణం చేస్తున్నారు. పాఠశాలలు, కళాశాలలకు వచ్చి..వెళ్లే సమయంలో ఆటోల్లో కిక్కిరిసి వెళ్తున్నారు. పిల్లల భద్రతను యాజమాన్యాలు గాలికి వదిలేస్తున్నాయి. పిల్లలు ఆటోల్లో ప్రమాదకరంగా ప్రయాణం చేస్తున్నప్పటికీ నియంత్రించాల్సిన యాజమాన్యాలు దృష్టిసారించడం లేదు. ఆటో డ్రైవర్లు కనీసం ట్రాఫిక్ నిబంధనలు పాటించడం లేదు. రవాణా, పోలీసు అధికారులు దృష్టిసారించి ప్రమాదకర ప్రయాణాలను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

–టెక్కలి రూరల్

ఆటస్థలం ఇలా.. ఆడేది ఎలా..



చిన్నపాటి చినుకు పడితే చాలు ఇచ్ఛాపురం మండలం డొంకూరు ఉన్నత పాఠశాల ఆట స్థలం చెరువులా మారిపోతుంది. దీంతో విద్యార్థులు ఆటలు ఆడేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఇచ్ఛాపురం నియోజకవర్గంలో అధిక సంఖ్యలో ఈ పాఠశాలకు చెందిన క్రీడా విద్యార్థులు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక అవుతున్నారు. సరైన ఆట స్థలం ఉంటే మరింత మంది విద్యార్థులు క్రీడాకారులుగా ఎదిగే అవకాశం ఉందని పిల్లల తల్లిదండ్రులు అంటున్నారు.

–ఇచ్ఛాపురం రూరల్

పొగమంచుతో అవస్థలు..



దట్టంగా కురుస్తున్న పొగమంచుతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. మండల కేంద్రం కంచిలి..ఇతర ప్రాంతాల్లో ఆదివారం ఉదయం ఏడు గంటల వరకు దట్టంగా మంచు కురవడంతో జాతీయ రహదారి మీదుగా రాకపోకలు సాగించే వాహనదారులు అవస్థలు పడాల్సి వచ్చింది. వాహనాలకు హెడ్‌లైట్లు వేసుకొని ప్రయాణించడం కనిపించింది. అలాగే పాదచారులు, వ్యవసాయ పనులకు వెళ్లేవాళ్లు ఇబ్బంది పడ్డారు.

–కంచిలి

బీలలో రైతు బిజీబిజీ..





కవిటి మండలంలోని బీలప్రాంతంలో రైతులు వరికోత పనుల్లో బిజీగా ఉన్నారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలతో తేరుకున్న రైతులు వరికోతలకు ఉపక్రమించారు. కంబైన్డ్ హార్వెస్టర్లు అనుకున్న స్థాయిలో అందుబాటులో లేకపోవడంతో కూలీల సాయంతో కోతలు చేస్తున్నారు. కోసిన వరిపైరును ట్రాక్టర్‌తో నడిచే హార్వెస్టర్ యంత్రంలో వేసి పొలాల్లోనే నూర్పులు చేస్తున్నారు.

–కవిటి

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత



ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తున్న ప్రసాదరావు

వజ్రపుకొత్తూరు రూరల్: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత సాధ్యమని సత్యసాయి రాష్ట్ర ఆధ్యాత్మిక సమన్వయకర్త పడాల ప్రసాదరావు అన్నారు. మండలంలోని బైపల్లి గ్రామంలో ఆదివారం సత్యసాయి భజన మండలి పదో వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆధ్యాత్మికత అమృతవాహిని కార్యక్రమంతో పాటు భక్తులు సాయి నామసంకీర్తన చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు. అలాగే జోనల్ స్థాయి సమావేశం ఏర్పాటు చేసి పలు విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో భగవాన్ సత్యసాయి బాబా జిల్లా అధ్యక్షులు శ్రీరామ చంద్రమూర్తి, జోనల్ కన్వీనర్ బైరాగి ఉన్నారు.

తీరం కళకళ..



వజ్రపుకొత్తూరు రూరల్: శివసాగర్ తీరంలో పర్యాటకుల సందడి

సోంపేట/వజ్రపుకొత్తూరు రూరల్: సోంపేట మండలం బారువ, వజ్రపుకొత్తూరు మండలంలోని అక్కుపల్లి శివసాగర్ సముద్ర తీరాలు ఆదివారం పర్యాటకులతో కళకళలాడాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాలతోపాటు ఒడిశా రాష్ట్రంలోని పలు గ్రామాల నుంచి పర్యాటకులు వచ్చి సందడిగా గడిపారు. వన భోజనాలు నిర్వహించి.. సాయంత్రం సముద్రస్నానాలు ఆచరించి సేదతీరారు. సోంపేట మెరైన్ సీఐ రమేష్ కుమార్, ఎస్ఐ శిరీష, వజ్రపుకొత్తూరు పోలీసులు, మెరైన్ సిబ్బంది బందోబస్తు చర్యలు చేపట్టారు.

రైల్వేస్టేషన్‌లో డిస్‌ప్లే బోర్డుల ఏర్పాటుకు చర్యలు



ప్లాట్‌ఫాం పరిశీలిస్తున్న ఐవోడబ్ల్యూ పండా, జెడ్‌ఆర్‌యూసీసీ సభ్యుడు శ్రీనివాసరావులో తదితరులు

కంచిలి: సోంపేట రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాంలో కోచ్ ఇండికేషన్ డిస్‌ప్లే బోర్డుల ఏర్పాటు పనులకు మోక్షం కలిగింది. దీనికి సంబంధించిన మెటీరియల్ శనివారం రాత్రి స్టేషన్‌కు చేరింది. దీన్ని జెడ్‌ఆర్‌యూసీసీ సభ్యుడు శ్రీనివాసరావులో, స్టేషన్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు, పలాస ఐఈడబ్ల్యూ పండా ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయనతో స్థానిక సభ్యులు స్టేషన్‌లో నెలకున్న సమస్యలను వివరించారు. స్టేషన్‌కు కావల్సిన వసతులపై మాట్లాడారు. కార్యక్రమంలో స్టేషన్ మేనేజర్ టి.బెహరా, స్టాండింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

41 మంది వాహనదారులపై కేసులు

కాశీబుగ్గ: కాశీబుగ్గ పోలీసు స్టేషన్ పరిధిలో పోలీసులుఆదివారం ట్రాఫిక్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. మున్సిపాలిటీలో అత్యంత రద్దీగా ఉండే కాశీబుగ్గ బస్టాండ్ వద్ద కార్లు పార్కింగ్, ద్విచక్ర వాహనాలను ఇష్టానుసారంగా పెట్టి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించిన వారిపై కొరడా ఝులిపించారు. కాశీబుగ్గ బస్టాండ్ వద్ద వాహనాలను నిలిపి వేసి గంటల తరబడి తీయకపోవడం సమస్యగా ఉంది. కూరగాయలు అమ్మే రైతులు, ప్రయాణికుల రాకపోకలు, బస్సుల తిరిగేందుకు తీవ్ర ఇబ్బందులు జరుగుతున్నాయని పోలీసులు గమనించి ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ఏఎస్సై ఆనందరావు ఆధ్వర్యంలో ట్రాఫిక్ సిబ్బంది 41 కేసులు నమోదు చేసి వారి వద్ద నుంచి రూ.18,400 జరిమానా వసూలు చేశారు.